# గాలిపటం

"పత్రిక వారం వారం చూస్తున్నారా? ఎట్లా ఉంటున్నది? ఏమన్నా కొత్త ఫీచర్లు పెట్టమంటారా?" అని కామేశ్వరరావు అడిగాడు.

"నేను మాత్రం ఏం చెప్పగలను? మెల్లిగా జర్నలిజంకు 'విక్టిమ్' అయిపోతున్నట్టు ఉన్నాను. మంచి బొమ్మ కనిపిస్తేనే కథ చదువుతాను. మా ఇంట్లో వాళ్లు మాత్రం పత్రిక ఇప్పుడు చాలా బాగుంటున్నదంటున్నారు" అన్నాడు నారాయణమూర్తి.

కామేశ్వరరావు యువకుడు, ఉత్సాహవంతుడు.

"కథ అంత బాగాలేనప్పుడల్లా ఒక మంచి ఇలస్ట్రేషన్ తగిలించమంటారా ఏమిటి? కథ స్టాండర్డ్ ఆటోమాటిక్‌గా పెరిగి ఊరుకుంటుంది!"

నారాయణమూర్తి కూడా కామేశ్వరరావుతోపాటు నవ్వాడు గాని, అంత ఉత్సాహంగా నవ్వలేదు. ఆయన నడివయస్సు వాడు. ఒకప్పుడు – ఈ కామేశ్వరరావు వయసులో – జీవితం కన్న చాలా వేగంగా కదిలినవాడే, కాని ఇప్పుడు జీవితమే ఆయనకంటె వేగంగా కదులుతున్నది. ఒక్కొక్కసారి జీవితపు సుడులనూ, దూకుళ్లనూ చూసి, "ఇందులో వ్యర్థ సంచలనం ఎంత ఉందో! ఈ ఆర్భాటానికి తగినంత పురోగమనం జీవితంలో ఏదీ?" అనుకునేవాడు. మరుక్షణమే, "వార్ధక్య లక్షణాలు ప్రవేశిస్తున్నై నాలో!" అనుకునేవాడు.

కామేశ్వరరావు పత్రికలో ఇటీవల పడిన కొన్ని మంచి రచనల పేర్లు చెప్పి వాటిని చదవమని సలహా ఇచ్చాడు. చదువుతానన్నాడు నారాయణమూర్తి.

"రోజూ ఇంతింత కట్ట దిగుతుంది. చదవలేక చస్తున్నామనుకోండి. సీరియల్స్ వచ్చి పడుతున్నై. ఇరవై చదివితేగాని ఒకటి మంచిది దొరకదు. పంపించేవాళ్లకి కొంచెం కూడా ఐడియా ఉండదు. ఒక్కొక్కరు మరీ అన్యాయం – ఇంతలావు కట్ట పంపించి మర్నాడే కార్డు రాస్తారు, వేసుకుంటున్నారా, లేదా అని!"

"ఆత్రం కొద్దీ రాస్తారు... నేను ఏదన్నా రాసి పంపితే అది పడినదాకా మళ్లీ నాకు దాని సంగతే జ్ఞాపకం వచ్చేది కాదు" అన్నాడు నారాయణమూర్తి అందులో ఉన్న నీతి ఏమిటో తేల్చకుండా.

"ఈ ఆత్రం చాలావరకు డబ్బు ఆత్రం లెండి. మీకారువాళ్లంతా సాహిత్యాభిలాషతో

రాసేవారు. ఇప్పుడు రాసే వాళ్లకి నాలుగు డబ్బులొస్తాయనే ఆశ కూడా జత అయి ఉంది.”

“ఎందుకుండగూడదు?” అన్నాడు నారాయణమూర్తి. “ఈ రోజుల్లో రాసేవాళ్లు పేరు తెచ్చుకోవటం ఎంత కష్టం! వెనకటి రోజుల్లో ఏ భారతిలోనో పేరు అచ్చయితే చాలు, గొప్ప సాహితీపరుడయిపోయేవాడు... అదీగాక ఆ రోజుల్లో కంటె ఈ రోజుల్లో రచయితకూ రచనకూ గల సంబంధం మరింత విస్పష్టంగా ఉందనుకుంటాను, అవునా?”

ఇందులో నీతి ఏమిటో కూడా నారాయణమూర్తి స్పష్టం చెయ్యలేదు. అందుకే ఆయన మాటల్లో కొన్ని కామేశ్వర్రావు చెవులకు స్వగతంలాగా వినిపించేవి. అతను ఏదో అనబోతూ ఎదురుగా చూసి ఆగాడు. నారాయణమూర్తి అప్రయత్నంగా వెనక్కు తిరిగి చూశాడు.

ఇరవై ఏళ్ల వయసుగల ఒక అమ్మాయి వాకిలి దగ్గర నిలబడి అనుమానంగా చూస్తున్నది. మనిషి కొంచెం బక్కపలచగానూ, ఎత్తుగానూ ఉన్నది. మనిషిలో ఏమన్నా ఆకర్షణ ఉంటే నొక్కుల జుట్టులోనూ, కళ్లలోనూ ఉన్నది. రెండూ నల్లగా మెరుస్తున్నై.

“ఏమండీ?” అన్నాడు కామేశ్వర్రావు ఆమెతో.

ఆపాటి పలకరింపు కోసమే ఎదురు చూస్తున్నదానిలాగా ఆమె గబగబా ముందుకు వచ్చి “మొన్న నేనొక సీరియల్ పంపించానండీ. అదీ – ఇది వీక్లీ ఎడిటర్‌గారుండే – మీరే వీక్లీ చూస్తారు కదూ?” అన్నది యమ కంగారుతో.

“అవునండీ. కూర్చోండి. మీ పేరు?” అన్నాడు కామేశ్వర్రావు, బుకింగ్ ఆఫీసులో టిక్కెట్లిచ్చే వాడికి ఉండదగినంత నిర్లిప్తతతో.

“నా పేరు వనజాక్షి అనుకోండి. మారుపేరుతో రాశాను – సాకీ.”

వనజాక్షి నారాయణమూర్తి పక్కనే కూచుంటూ చిన్న నవ్వు నవ్వింది. కాని కళ్లలో బెదురు పూర్తిగా పోలేదు.

“ఓ, మీరు పంపినది నిన్ననే అందింది. పేరు ‘ప్రజ్ఞావంతులు’– కాదూ?”

వనజాక్షి ఈసారి కొంచెం ధైర్యంగా నవ్వి, ఔనన్నట్లు తల పైకి కిందికీ ఆడించి, “చూశారన్నమాట! ఎలా ఉంది? వేసుకోదగినట్టుగా ఉందాండీ?” అన్నది.

“చూసినమాట నిజమేగాని ఇంకా చదవలేదు. తొందరలేదు కూడానూ. ఇప్పుడు నడిచే సీరియల్ అయిపోగానే ఇంకొకటి సిద్ధంగా ఉంది. కనీసం నాలుగు నెలలదాకా!”

కామేశ్వర్రావులో ఇప్పుడు మొహమాటం ఏమీ లేదు. ఇటువంటివాళ్ల మీద చూపటానికి అతనిలో సింపతీ ఉండటం సాధ్యంకాదు.

నారాయణమూర్తి కళ్ల ఎదటనే వనజాక్షి సాన్‌ఫొరైజ్ చెయ్యని బట్టలాగా ముడుచుకు

పోయింది. ఆమె గొంతు కూడా క్షీణించింది. "కనీసం చదివి పనికొచ్చేదీ లేనిదీ తెలిస్తే–" అన్నది.

"మీ రచన కన్న ముందు వచ్చినవి నలభై కథలూ, నాలుగు సీరియల్సూ చదవవలిసినవి ఉన్నాయి. వచ్చిన కంట్రిబ్యూషన్స్ చదవటం గాక మాకింకా ఎన్నో పనులుంటాయి చూడండీ!" అన్నాడు కామేశ్వర్రావు.

వనజాక్షి మొదటిసారిగా నారాయణమూర్తి కేసి తలతిప్పి చూసింది. ఆ చూపు నీరసంగా ఉండటమే గాక దాని అభిప్రాయం కూడా నారాయణమూర్తికి అర్థమయింది. ఇటువంటి వయసు మళ్లిన వాళ్లతో బాతాఖానీ కొట్టటమే కదా మీకుండే ఇతర పనులు – అన్నట్లుగా.

"వారు నారాయణమూర్తి గారు. మీరు పేరే విని ఉంటారు!" అన్నాడు కామేశ్వర్రావు.

నిర్జీవమైన కళ్లు సజీవమైనై! తన పేరు ఈ చాదస్తపు పిల్లకు కూడా తెలిసినందుకు నారాయణమూర్తి బద్ధకంగా సంతోషించాడు కూడా.

"ఓహో! మీ 'దేవుడిచ్చిన వరం' ఇరవై సార్లు చదివి ఉంటాను. చాలా సంతోషమండీ! నమస్కారం!" అన్నది వనజాక్షి.

కంగారు. నమస్కార బాణం మొదటే పారెయ్యాలి. "నమస్కారం!" అన్నాడు నారాయణమూర్తి అంతగా ఇష్టం లేనట్టుగా.

కాని ఆ పిల్ల ఆయన గొంతులో "శైత్యం" గమనించినట్టులేదు. ఆమె కామేశ్వర్రావును తోసిపారేసి, నారాయణమూర్తే వీక్లీ ఎడిటరయినట్టుగా "చూడండీ! నేను కథలు రాసే మనిషిని కాను. నాకు చాత కాదు కూడానూ. అయితే ఒక ఫ్రెండుకు సహాయం చెయ్యవలిసి వచ్చి, ఇంకేవిధంగానూ డబ్బు పుట్టించలేక ఒక సీరియల్ కథ రాసి పంపించాను. వేసుకోవటానికి పనికివస్తుందనిపించే పంపించాననుకోండి. వీక్లీలో కొన్ని కథలూ అవీ బాగున్నా కొంత చెత్ – కొంత బాగా లేనిది కూడా పడుతూనే ఉంటుంది గదా. దానికిందనన్నా జమ కాకపోతుందా అనుకున్నాను. వారు చూసి వేసుకుంటామంటే డబ్బు పట్టుకుపోదామని. ఇంకా నాలుగు రోజుల్లో ఎగ్జామినేషన్ ఫీజ్ కట్టాలి. పాపం. అతనిదగ్గర చిల్లిగవ్వ లేదు. మా నాన్నగారికి జీతం వచ్చిననాడు పర్సులో నుంచి కొట్టెయ్యాలని ఎంత టెంప్టేషన్ వచ్చిందో చెప్పలేను. అదృష్టవశాత్తూ ఒక రోజల్లా దాన్ని అణుచుకున్నాను. మర్నాటికి పర్స్ ఖాళీ అయిపోయింది. (నిట్టూర్పు) మెడలో గొలుసు అమ్మేద్దామమని మరొక టెంప్టేషన్. గొలుసు తీసి దాచమని అమ్మకిచ్చేశాను. 'ఎందుకే?' అంటుంది. ఏం చెప్పను? కథ బాగున్నదీ లేనిదీ ఇవాళ రేపట్లో చెప్పి డబ్బు ఇప్పించేస్తే–"

వనజాక్షి ఇంకా నారాయణమూర్తి కేసే చూస్తున్నది. ఆయన కామేశ్వర్రావు కేసి, ఏమిటిది? అన్నట్టుగా చూశాడు.

"మీరనుకున్నట్టు జరుగుతుందని నాకేమీ హోప్‌లేదు సుమండీ! ఒకవేళ మీ కథ సీరియల్‌గా వెయ్యటానికి పనికి వచ్చినా (ఆ హోప్ కూడా లేనట్టు గొంతులో ధ్వని) దాన్ని నాలుగు మాసాల అవతలే వేసుకునేది. సీరియల్ పూర్తి అయినదాకా డబ్బిచ్చే ఆచారం ఇక్కడ లేదు" అన్నాడు కామేశ్వరరావు.

వనజాక్షి లేచి నిలబడింది. ఆమెలో ఇప్పుడు బెదురుగాని నిరాశగాని లేదు. "కాళ్లూ గడ్డాలూ పట్టుకుని డబ్బు ఎలాగో నేను వసూలు చేసుకుంటాను. మీరు కాస్త దాన్ని చదివి పనికొచ్చేదీ లేనిదీ ఇవాళ రేపట్లో తెలియజేస్తే చాలా పుణ్యం ఉంటుంది. పనికివస్తుందంటే పోనీ ఇంకో చోటనైనా ఇస్తాను... అన్నట్టు వేసుకునే పక్షంలో మీరు ఏపాటి ఇస్తారండీ?"

కామేశ్వరరావుకు ఈ ధోరణి చాలా గడుసుగా కనిపించింది. ఈ మనిషి తనను ఉచ్చుల్లో పెట్టేస్తున్నది.

"ఎలా చెప్పటం?" అన్నాడతను.

ఆమె ఎంతో సౌజన్యంతో చిరునవ్వు నవ్వి, "నాకు తెలుసులెండి. రాసే మనిషిని బట్టి ఉంటుంది. అధమం ఎంత ఇస్తారు. ఒక వందయినా ఇస్తారు గద?" అన్నది.

"వేసుకుంటే!" అన్నాడు కామేశ్వరరావు, అపోహకు తావులేకుండా ఉండగలందులకు.

"వేసుకోని వాటికి డబ్బిస్తారని నేను అనుకోవటంలేదు లెండి" అన్నది వనజాక్షి, కామేశ్వరరావును "ఫూల్" చెయ్యటానికే. అతను ముఖం చిట్లించి బల్లమీది కాగితాలు ఇటు తీసి అటు పెట్టాడు. "ఇక తమరు దయచెయ్యవచ్చు!" అని అతని అభినయానికి అర్థం. ఆ మాట అర్థమైనట్టుగా వనజాక్షి వెనక్కు తిరిగి వెళ్లిపోతూ వాకిలి దగ్గర తిరిగి చూసి "నమస్కారమండీ, నారాయణమూర్తిగారూ. చాలా సంతోషం! సెలవిప్పించండి" అన్నది.

ఆమె వెళ్లినాక నారాయణమూర్తి చప్పుడు చెయ్యకుండా తనలో తాను నవ్వుకున్నాడు. కామేశ్వరరావులో ఇంకా చిరచిర తగ్గలేదు.

"ఈకాలపు యువతుల్లో ఇదొక కొత్తరకం అనుకుంటాను" అన్నాడు నారాయణమూర్తి.

"ఈ అమ్మాయి ఇంకా నయమనుకోండి – తిట్టకుండా వెళ్లింది!" అన్నాడు కామేశ్వరరావు.

"పత్రికలకు రాసే మనిషిగా ఆలోచించటం లేదు. ఆ మనిషి మనస్తత్వం మాట చెప్పాను. ఎవరో పరీక్షకు కట్టలేకపోవటమేమిటి? ఈ అమ్మాయి డబ్బుకోసం అలవాటు లేని ఔపోసనగా కథ రాయటమేమిటి? ఎవరికోసం ఇంత హైరాన పడుతున్నది? ఇందులో ప్రణయం కూడా ఏమైనా ఏడిచిందేమో!" నారాయణమూర్తి చల్లగా స్వగతంలోకి పడి,

"ఇంతమంది రాస్తున్నారు. ఎవరు ఎందుకు రాస్తున్నారో చెప్పలేం కద! డబ్బుకోసం రాసేవాళ్లు కూడా ఆ డబ్బుతో వాళ్లు ఏం చేస్తారో చెప్పలేం. సహజంగా పత్రికలకు అదేమీ పట్టదు. బాగుంటే వేసుకుంటారు, లేకపోతే... ఇంతకూ ఈ పిల్ల రాసింది ఏమన్నా వేసుకోదగినట్టుందా?" అని చప్పున పైకి తేలాడు.

"ఏమోనండీ. అక్కడక్కడా రెండు బంతులు చదివి చూశా. అంతా సంభాషణే. సంభాషణ సహజంగానే ఉంది. అందులో పిండి ఎంత ఉన్నదీ చదివితే గాని తెలీదు" అన్నాడు కామేశ్వర్రావు.

"అయితే, ఇంకేం, చదివి చూసి ఎటో తేల్చి ఒక కార్డుముక్క రాసి పారెయ్యండి. ఆ పిల్ల రావటం తీరిపోతుంది."

"ఇప్పుడు నేను చదవకేం?" అన్నాడు కామేశ్వర్రావు.

తనకే ఏదో అన్యాయం జరుగుతున్నట్టుగా నారాయణమూర్తి నొచ్చుకున్నాడు.

"అలా అయితే నేను పట్టుకుపోయి చూడనా ఏమిటి? మళ్లీ రేపో ఎల్లుండో పంపిస్తాను."

నారాయణమూర్తి నోటివెంట ఆ మాటలు రావటం అత్యాశ్చర్యం. ఆయన తన మనసులో కూడా పూర్తిగా ఏర్పడని భావం పైకి అనేశాడు. అది విడ్డూరమైన ఆలోచన అన్నది కామేశ్వర్రావు ముఖంలో చిరునవ్వు ద్వారా ఆయనకు తెలియవచ్చింది. ఆయనక్కూడా చిరునవ్వు ఆగలేదు.

"నేను నిజంగా చదవదలిచినది ఆ కథ కాదనుకుంటాను; ఆ పిల్ల మనసు" అన్నాడాయన ఆత్మ పరిశోధన చేసుకుంటూ.

"బహుశా చదవటానికి ఆమె మనసులో ఏమీ ఉండదు" అన్నాడు కామేశ్వర్రావు, పక్కకు వంగి కింది డ్రాయరులో నుంచి లావుపాటి కాగితాల బొత్తి పైకి తీస్తూ.

"ఇదేనా? 'ప్రజ్ఞావంతులు' రచన. "సాకీ". వెంటనే తిప్పి పంపేస్తాను. అభ్యంతరం ఉండదుగా?"

"ఒక నెల ఆగి పంపినా తొందరలేదు. పనిలోపని. నిజంగా బాగుంటే చెప్పండి. తప్పక వేస్తాను" అన్నాడు కామేశ్వర్రావు.

* * * * *

నారాయణమూర్తి ఇంటికి వచ్చాక "ప్రజ్ఞావంతులు" గురించి పూర్తిగా మరిచిపోయాడు. అది తన వెంట తీసుకురావటం చిలిపిపని అని ఆయనకు దారిలోనే అనిపించింది. "తద్దోష పరిహారార్థం" మనసు అనేక గమ్మత్తులు చేస్తుంది. నారాయణమూర్తి మనసు చేసిన గమ్మత్తేమిటంటే దానిని గురించి పూర్తిగా మరిచిపోవటం.

మర్నాడు రాత్రి ఆయన భార్య "ఈ కట్ట ఏమిటండీ?" అని అడిగిన దాకా ఆయనకు వనజాక్షి రచన జ్ఞాపకం రాలేదు.

"అయ్యయ్యో! దాన్ని చదవనేలేదు! ఇప్పుడు చదువుదునా?" అనుకున్నాడు. దీపం దగ్గర కూచుని ఒక్క ముక్కకూడా చదువకుండా పేజీలు తిప్పుతూ ఆఖరు పేజీ దగ్గరికి వచ్చేసి "సి. వనజాక్షి, 15 నాయర్ వీథి, మైలాపూర్" అన్నది మాత్రం చదివి మూసేశాడు.

నిజానికి చదవటానికేముంటుంది? అందరూ రాసే విషయాలే ఉంటై. కాని అది రాసిన మనిషి మాటేమిటి? ఆ పిల్లకి కొంచెం కూడా ప్రపంచజ్ఞానం లేదు. ఉంటే కొండకు వెంట్రుక కట్టి లాగదు. రెండు మూడు రోజుల్లో వంద రూపాయలూ వచ్చి వొళ్లో పడతయ్యనుకుంటున్నది. అమాయకురాలు! నిజంగా వచ్చి పడితే ఎంత సంతోషిస్తుందో...! మాట్లాడకుండా తనే ఆమె పేర వందరూపాయలు పంపేస్తే...!

"నాకేమన్నా మతిపోయిందా ఏమిటి?" అని నారాయణమూర్తి అనుకున్నాడు. కాని ఆ వనజాక్షికి వంద రూపాయలు పంపటం మతిలేని ఆలోచన అని తననుతాను నమ్మించుకోలేక పోయినాడు. అందులో కొంత జీవిత సాఫల్యం ఉన్నది. ఎవరూ చెయ్యరు గదా అని మనం కొన్ని పనులు చెయ్యటానికి జంకగూడదు. అలా జంకితేనే జీవితం నిస్సారంగా ఉండేది. ఈ వనజాక్షికి నవలలు రాయటం చాతనవునో లేదోగాని, జీవితాన్ని ప్రవాహంలో ఉంచటం తెలుసు.

తన జీవితం చెరువల్లే ఏనాడో అయిపోయింది. ఒకప్పుడు తనలో ఉండిన సంచలనం ఈనాడు లేదు. ఆ రోజుల్లో మామూలు సంఘటనలు తనను కదిలించేవి. కథలు రాశాడు. ఇప్పుడు రాద్దామన్నా ఏమీలేదు.

వనజాక్షి వచ్చి అయిదు నిమిషాలలో తనను కెలికిందా? నారాయణమూర్తి ఆశ్చర్యపడ్డాడు. లేకపోతే తనకు ఇటువంటి ఆలోచనలు రావు...

నారాయణమూర్తి మర్నాడు వనజాక్షికి నూరు రూపాయలు మనియార్డరు చేశాడు. "ఇది చెయ్యగూడని పని! చాలా బుద్ధితక్కువ పని! ఈ సంగతి తెలిస్తే అందరూ నిన్ను చూచి నవ్వుతారు!" అని అంతరాత్మ శతపోరినా వినిపించుకోలేదు. "ఏమవుతుందో చూద్దాం! డబ్బు దండగ కాదు. అంతా అయితే పుస్తకంగా అచ్చు వేసినా అమ్ముడై పెట్టిన డబ్బు తిరిగి వస్తుంది. వెనకటిలాగా కాదు. ఎటువంటి పుస్తకాలైనా కొని చదువుతున్నారు" అని ఆయన తనను తాను సమాధానపరుచుకున్నాడు.

❋❋❋❋❋

వనజాక్షికి డబ్బు పంపి నారాయణమూర్తి ఏం సాధించుదామనుకున్నాడో చెప్పటం

కష్టం. ఒక విడ్డూరమైన ఆడపిల్లను ఆదుకుని సంతోషపెడదామన్నదే ఆయన ఆశయమైతే అది బెడిసికొట్టింది.

ఆదివారం సాయంకాలం వనజాక్షి ఆయనను వెతుక్కుంటూ వచ్చి చిన్న పోట్లాట పెట్టుకున్నది. ఆమె వంద రూపాయలూ తెచ్చి ఆయన చేతిలో పెట్టి "నాకింత అవమానం జరుగుతుందనుకోలేదు. మీరు పేరు పడిన రచయిత అయి ఉండి కొత్తగా రాసేవాళ్లను ఇలా చూడటం ఏమీ బాగాలేదు. ఇది మీకు ప్రతిష్ఠ కాదు" అన్నది.

నారాయణమూర్తికి ఎవరో ముఖం మీద కొట్టినట్టయింది. ఆ మనిషి అంత ఆగ్రహపడవలసిన అవసరం ఏమిటో తెలియలేదు. పైపెచ్చు వనజాక్షిలో పైకి కనిపించే ఆగ్రహం అడుగున అశ్రువులు అణచిపెట్టి ఉన్నట్టు కూడా ఆయనకు అనుమానం కలిగింది. ఈ అశ్రువులెందుకో అసలు అర్థం కాలేదు.

"ఇప్పుడేం జరిగిందీ? వీక్లీ వాళ్లు ఎట్లాగూ నీ అవసరానికి డబ్బివ్వరు. అంతదాకా దాన్ని అప్పు కింద తీసుకో. వాళ్లిచ్చినప్పుడు నా బాకీ తీర్చవచ్చు" అన్నాడు నారాయణమూర్తి.

"దాన్ని వాళ్లు వేసుకోకపోతే ఎలా తీర్చుతాను? మీ డబ్బు మీరు తీసేసుకోండి" అన్నది వనజాక్షి తన ఉద్రేకాలతో కుస్తీ పట్టుతున్నదానిలాగా.

"నేను వేసుకోమంటే వేసుకుంటానన్నారు. వేసుకోమని చెబుతాను."

వనజాక్షి ముఖాన మబ్బులు కాస్త విచ్చాయి.

"మీరు చదివారా నా కథ? ఎలా ఉంది? బాగాలేకపోతే చెప్పండి. నన్ను ప్రోత్సహించటానికి అబద్ధం చెప్పకండి" అన్నదామె.

"భేషుగ్గా ఉంది – సహజత్వం – పాత్రలు చాలా వాస్తవంగా –" అంతరాత్మను తోసిరాజని నారాయణమూర్తి అబద్ధాలాడాడు. ఆయన ఆ పిల్ల రాసిన ఒక్క వాక్యం కూడా చదవలేదు. చదవాలనే అనుకున్నాడు గాని ఎందుకో పడింది కాదు.

"నన్ను ఎంకరేజ్ చెయ్యటానికి అంటున్నారు."

"కాదు! నిజం!"

"థాంక్స్! అలా అయితే వీక్లీలో తప్పక పడుతుంది గనక మీ డబ్బు మీరే ఉంచుకోండి. పడినాకనే డబ్బు రానివ్వండి."

"మరి నీ అవసరం గడవదుగా?"

"దానికేమీ తొందరలేదు లెండి. అతను స్నేహితుల దగ్గిర అప్పు తెచ్చాడుట. నా దగ్గిర తీసుకోవటం నామోషిట. అందరికీ తెలిస్తే ఏమన్నా అనుకుంటారుట. ఈ వంద రూపాయలతో నేను తనను కొనేసుకుంటానేమోనన్నట్టు భయపడ్డాడు మానవుడు!" అన్నది వనజాక్షి ముఖం చిట్లిస్తూ.

ఆ మనిషి ఎవరు? నీ కేమవుతాడు? అని అడగాలనిపించింది నారాయణమూర్తికి.

కాని వనజాక్షి అశ్రువులకు కారణం తెలుసుకున్న సంతృప్తితో ఆయన తృప్తిపడ్డాడు. ఆమె తన మీద చూపిన ఆగ్రహం కూడా నిజంగా తన మీద కలిగినది కాదు. అవతలివాడు తెప్పించినదే.

"నా కథ వీక్లీకి తిప్పి పంపించారా?"

"లేదు. రేపు పంపిస్తున్నాను."

"మీ ఉపకారం మరిచిపోను. నమస్కారం!"

వచ్చినప్పుడు నమస్కారం చెప్పలేదు. తన డబ్బు తనకే ఇచ్చి పోయింది. వనజాక్షి వెళ్లగానే నారాయణమూర్తి భార్య గదిలోకి వచ్చి "ఇది ఎవతె?" అని అడిగింది. తెలుసుకుందామని కాదు. "దానికీ" తనకూ ఏదో ఉండరాని సంబంధం ఉన్నట్టు తన భర్త ఒప్పుకోకపోతే ఏదో విధంగా ఒప్పిద్దామని... భార్యతో పడలేక నారాయణమూర్తి ఒప్పుకున్నంత పనీ చేశాడు కూడానూ!

❁ ❁ ❁ ❁ ❁

మొత్తం మీద నారాయణ మూర్తి చదవకుండానే "ప్రజ్ఞావంతులు" వీక్లీ వాళ్లకు తిరిగి వెళ్లింది. నారాయణమూర్తి తన ఆఫీసు టెలిఫోనుద్వారా కామేశ్వర్రావుతో "వేసుకోవచ్చుననుకుంటా!" అని చెప్పాడు.

"మీరాపాటి ధైర్యమిస్తే తప్పకవేద్దాం!" అన్నాడు కామేశ్వర్రావు.

నారాయణమూర్తికి పెద్ద బరువు దిగిపోయినట్టయింది. వనజాక్షి అధ్యాయం ముగిసిందనుకున్నాడు. ఆయన ఆ పిల్లను గురించి ఆలోచించటం కూడా మానేశాడు.

అందుచేత ఒక గురువారం అయిదు గంటల ప్రాంతాల వనజాక్షి తన ఆఫీసుకు వచ్చేసరికి నారాయణమూర్తికి ఆశ్చర్యం వేసింది. ఆమె చనువుగా ఆయన బల్లకెదురుగా కూచుని "నిజంగా మీరు నాకు గురువులాటివారనాలి. మీ చలవవల్ల నేను కూడా రాసే వాళ్ల జాబితాలో చేరబోతున్నాను. ఈ సీరియల్ పూర్తి కాగానే 'ప్రజ్ఞావంతులు' ప్రారంభిస్తున్నట్టు వీక్లీ వాళ్లు ఉత్తరం రాశారు" అన్నది.

"భేష్! నేను చేసిందేమీలేదు. గట్టిగా వేసుకోమని కూడా అనలేదు" అన్నాడు నారాయణమూర్తి ఆమె కృతజ్ఞతకు ఎందుకో వెరుస్తూ...

"మీ ఆఫీసు టైమింకా కాలేదా...? మీరు నేరుగా ఇంటికి పోతున్నారా...? ఏ బీచికన్నా వెళ్లి ఒక్క గంటసేపు మాట్లాడుకుందామా? మీ నుంచి చాలా విషయాలు తెలుసుకోవాలి" అన్నది వనజాక్షి.

కాని బీచిలో కూచుని ఆమె తన విషయాలే చెప్పింది గాని నారాయణమూర్తిని

ఏమీ అడగలేదు. "నేను అందరిలాటిదాన్ని కాననుకుంటాను. నాకు ప్రతి చిన్న సంఘటనలోనూ అగాథమైన డ్రామా కనిపిస్తుంది. మనుషులంతా ఒకటిగానే ఉంటారు అని మాట వరసగానైనా సరే ఎవరన్నా అంటే నాకు 'అబద్ధం' అని గట్టిగా అరవాలనిపిస్తుంది. కాని నాకు కల్పన చేతకాదు. ఈ సీరియల్‌లో మనుషులంతా నిజమైన మనుషులే. తెలివిగా మాట్లాడుతున్నాననుకున్నప్పుడల్లా అరిచి మాట్లాడే ఆవిడ మా అమ్మ. నవ్వుతున్నప్పుడల్లా ఏడుపు మొహం పెట్టే మనిషి మా నాన్న..."

ఆ రోజు వీక్లీ ఆఫీసులో ఈ వనజాక్షిని గురించి తెలుసుకోవాలని నారాయణమూర్తిలో కలిగిన కోరిక ఇప్పుడు తీరనారంభించింది. కాని ఇప్పటికీ ఒక ప్రతిబంధకం దిగబడిపోయింది. ఆయన ఆ "ప్రజ్ఞావంతులు" చదవనేలేదు. అది చదివితే తప్ప వనజాక్షి పూర్తిగా అర్థం కాదు. ఆమె తన స్వభావాన్ని ఆ నవలలో చాలా రంగరించినట్టున్నది.

ఆమెకు దాపరికం కూడా ఆటే లేదు. ఆ పరీక్షకు వెళ్ళినవాడు వనజాక్షి స్నేహితురాలు అన్నపూర్ణకు అన్న. అతనిమీద చాలాకాలంగా ప్రేమ భావం లాటిది ఉన్నట్టు ఆమె ఒప్పుకున్నది. ("ఎవరు ఏ ఇబ్బందిలో ఉన్నా నా గుండె అతి సులువుగా కరిగిపోతుంది. ఇతరుల కష్టాలు భరించటం నాకు కొంచెం కూడా చాతకాదు.") కాని చెయ్యబోయిన సహాయాన్ని వాళ్లు అపార్థం చేసుకున్నారు. అన్నపూర్ణే అన్నదిట – "కట్నం లేకుండా మొగుణ్ని సంపాదించాలని చూస్తున్నదా?" అని వాళ్ల అమ్మ అన్నది...

నారాయణమూర్తి కూడా మాటల సందున తన స్వవిషయాలు కొన్ని చెప్పుకున్నాడు. మంచి సాంఘిక ప్రయోజనం కనపడనిదే తాను కథ రాయలేదు. ఊరికే మనుషుల మనస్తత్వాలు చిత్రించటం తనకు వృథా ప్రయాస అనిపిస్తుంది. తన దృష్టిలో ప్రేమ సామాజికం – అచ్చుగా వ్యక్తులకు సంబంధించినది కాదు. ప్రబంధ ప్రణయంలో తనకు నమ్మకం లేదు. తాను జీవితంలో ప్రేమకంటే అసూయ చాలా హెచ్చుగా చూశాడు. ప్రేమ నుంచే అసూయ పుడుతుందన్నది తనకెక్కడా కనిపించలేదు. ప్రేమలో ఏదో పురుగు పుట్టినప్పుడే అసూయ ఏర్పడుతుంది.

మాటల సందర్భాన అనేక వందల విషయాలను గురించి ఇద్దరూ ఎవరి అభిప్రాయాలు వారు చెప్పుకున్నారు. ప్రతి వారమూ ఒకటి రెండు సార్లు ఇద్దరూ బీచికి వెళ్లేవాళ్లు – స్నేహితుల లాగా. ఇద్దరికీ మాట్లాడుకునేటందుకు ఎన్నో విషయాలున్నట్టు కనబడేవి.

ఆ తరువాత "ప్రజ్ఞావంతులు" వీక్లీలో ప్రారంభమయింది. ఆరు వారాలలో పూర్తి అవుతుందని నారాయణమూర్తికి తెలిసింది. అంతా కలిసి చదువుకుందామనుకుని ఆయన సంచికలు జాగ్రత్తగా దాచిపెట్టాడు.

ఇంతలో ఆయనకు ఫ్లూ జ్వరం వచ్చింది. నయమైనట్టు నయమై మళ్లీ వచ్చింది.

వారం రోజులు ఇల్లు కదలకుండా ఉండి తరవాత మళ్లీ ఎప్పటిలాగా ఆఫీసుకు వెళ్లాడు. ఈ లోపల ఆయన చేసిన ఒక్కపనీ ఏమిటంటే "ప్రజ్ఞావంతులు" మొదటి నుంచీ చివర దాకా చదివేశాడు. నిర్ఘాంతపోయాడు.

వనజాక్షి మామూలు రచయిత మాత్రం కాదు. జీనియస్. ఆధునిక సాహిత్యపు రహదారిలో ఒక కొత్త మైలురాయి; ఏమీ సందేహం లేదు. తాను ఆ కథను ఏనాడో చదివి ఉండవలిసింది. సంఘాన్ని విమర్శించటం ఆమెకు పుటకతోనే వచ్చినట్టున్నది. ఆమెలో ఏ కోశానా ఎరువు తెచ్చుకున్న అభిప్రాయాలున్నట్టు లేవు. అనేక వాక్యాలు తనను నిద్రలేపుతున్నట్టుగా ఉన్నాయి. అట్లా రాయటం సులభం కాదు. ఆమెలో తనకు నాలుగో వంతు శక్తి లేకపోయినా తనకు పేరు వచ్చింది. అన్యాయం, చాలా అన్యాయం.

టెలిఫోన్ మోగింది "మూర్తిగారా?" ఉన్నారు.

నారాయణమూర్తి సీటులో నుంచి లేచి వెళ్లి టెలిఫోన్ తీసుకున్నాడు. వనజాక్షి.

"బతికి మామూలుగా ఉన్నారా? ఫ్లూ వచ్చిందని విన్నప్పటినుంచీ నాకు మతిపోయింది. పత్రిక చూడ భయం. వేలకు వేలు ఫ్లూ కేసులూ, డజన్ల కొద్దీ చావులూనూ! ఎంత బాధపెట్టారండీ! నేనేం చేశాను ద్రోహం మీకు? అంతా పూర్తిగా నయమైందా? మళ్లీ రాదు కదా?... ఈ పూట బీచికి వస్తాను. ఓపిక ఉంటే రండి."

"చూస్తాను."

నారాయణమూర్తి టెలిఫోన్ పెట్టేశాడు. ఆయన గుండె అతి వేగంగా కొట్టుకుంటున్నది. ఆయన సీటులో వెళ్లి కూచున్నాడే గాని తాను గాలిపటంలాగా తేలిపోతున్నట్టుగా భావించుకున్నాడు. తాడు పట్టి ఎవరైనా నేర్పుగా గుంజితే గాలిపటానికి తేలిపోవాలని ఉంటుంది. తనను గుంజుతున్న మనిషి అద్భుతమైన నేర్పుగలది. "ప్రజ్ఞావంతులు" లో అరడజను మందిని గాలిపటాలు కట్టి ఎగరేసింది. తాను ఆమె ప్రజ్ఞ చూసి సంతోషించటం ఒక ఎత్తు, తానే ఒక గాలిపటం కావటం ఒక ఎత్తూనూ.

"గాలిపటం లాగా ఎగరటంలో తాత్కాలికంగా కొంత ఆనందం ఉన్నా ప్రమాదం కూడా ఉన్నది. తాడు ఎప్పుడు తెగినా తెగవచ్చు. పైగా పొద్దు వాలుతున్నది. చీకటి పడే వేళకు నేలను అంటిపెట్టుకుని ఉండటం క్షేమం" అనుకుంటూ నారాయణమూర్తి ఆఫీసు విడవగానే ఇంటికి వెళ్లే బస్సు పట్టుకున్నాడు.

***ముద్రణ: యువ మాసపత్రిక, మే 1960***